# కొలీగ్ అంటే........!

ఎ.సి. గదిలో కూర్చున్నా, ముచ్చెమటలు పోసాయి నాకు వంగిచేతిరుమాలుతో మొహంవత్తుకొని తలెత్తి చూసాను. మాకర్మాగారములో నిర్విరామముగా వెలిగే మంటకన్నా ఎర్రగా వున్నాయి మా జి.ఎం. గారికళ్ళు.

“ఛీ. ఛీ.. ఎం పాడుపని చేసారండీ” జి.ఎం. విసుక్కున్నారు. “ వచ్చిన ఉ ద్యోగము బుద్ధిగా చేసుకోక...”

“నాకు - నాకు ఏమీ...” నా మాట తడబడింది. కాళ్ళూ చేతులూ వణికేయి. ఏవేవో చెప్పాలని అనుకున్నాను. కానీ పెదవులు సహకరించలేదు.

“నామాట నమ్మండిసార్”

“ఏమిటి నమ్మమంటావు? నీకు తెలీకుండానే బంగారపు ‘బేరింగ్’ దానంతట అదే నడచుకొనివెళ్ళి నీ సంచిలో కూర్చుందా?”

ఏమి మాట్లాడగలను! నా సంచిలో దొరికిన బంగారపు ‘బేరింగ్’ నేను దాచలేదు అంటే ఎవరు నమ్మగలరు?

కర్మాగారములోని యంత్రాలని బాగుచేసే పనిలో వున్నాము. పని వత్తిడి వల్ల మధ్యాహ్న భోజనము పిదప నా సీటుకు వెళ్లనే లేదు సైరన్ మోత విని టయిం అయిపోయిందని ఆదరాబాదరాగా సీటు దగ్గరకు వెళ్ళి నా సంచి తగిలించుకొని బయలుదేరాను.

ఎదురుగా నిలబడి వున్నారు మా జి.ఎం. గారు, ఓ రక్షకభటుడు “మీ సంచీ తనిఖీ చెయ్యాలి”

“నా సంచిలో ఏముంటాయండీ కంపెనీ వస్తువులు”

“ఏమో!” మా జి.ఎం. అన్నారు. “ఏ పుట్టలో ఏ పాము వుందో ఎవరికి ఎరుక”

"ఏమిటి ఈ హదావిడి సార్?" సంచీ రక్షకభటునికి అందిస్తూ అడిగేను.

"బంగారపు 'బేరింగ్' ఒకటి కనపడడం లేదు. ప్రతి ఒక్కరినీ తనిఖీ చేస్తున్నాము".

"ఓ! అదా సంగతి" నేను తేలికగా నవ్వాను.

"ఇందులో వుంది సార్" గట్టిగా అరిచేడు రక్షకభటుడు. "ఈ సంచిలో వుంది" అతను సంచి నుంచి ఆ 'బేరింగ్' బయటకు తీసాడు.

నాగుండె ఆగిపోయినట్లు అనిపించింది.

"చూసావా" మా జి.ఎం. గారి కళ్ళు మెరిసాయి. "ఎంత తెగింపు! ఉద్యోగం ఇంకా ఖాయం అవలేదు..." అతను ఓ నిమిషం ఆగేరు. ఆ తర్వాత అన్నారు. "పద నాగదికి".

నాకు చెంప మీద కొట్టినట్లయింది. జి.ఎం. గారి వెంటనడిచాను.

పశ్చిమా నఅవమానభారంతో కృంగిపోయిన సూర్యుడు మబ్బులగదిలో దూరాడు.

"సారీ, శర్మగారు" మా జి.ఎం గారు అన్నారు. "మీరు ఇంక వెళ్ళవచ్చు. నెక్స్ట్ జాబులోనయినా జాగ్రత్తగా ప్రవర్తించండి"

కేబిన్ బయటకు వచ్చాను. కాళ్ళూ చేతులూ ఆడలేదు. ఎంతో కష్టపడి సంపాదించిన ఉద్యోగం ఆరునెలలకే ఊడిపోతున్నట్లుంది.

ఏమిటిచెయ్యటం?

గిరి గురించి వెదికెను.

గిరి నా సహోద్యోగి. నా కన్నా ఐదేళ్ళు సీనియర్. మా జి.ఎం. గారికి చాలా సన్నిహితుడు. గిరి మాటే జి.ఎం. మాట అని అంటూ వుంటారు కొందరు. అతని ద్వారా జి.ఎం. గారిని బ్రతిమాలుకుంటే....

ఏదోపని వుందని గంట ముందే వెళ్ళిపోయాడట, గిరి.

గిరి ఇంటివైపు నడిచాను.

మెలమెల్లగా చీకటిలోకి జారిపోతోంది ప్రపంచం. అపోహల మబ్బులలో చిక్కుకుపోయిన సూర్యుడు కనబడడం లేదు.

"ఆయన ఇంట్లో లేరండీ" గిరి భార్య పలకరింపుగా అన్నారు. "కూర్చోండి వచ్చేస్తారు"

అలవాటయిన కుర్చీలో కూలబడ్డాను. రోజు రాత్రి గిరి ఇంట్లో కూర్చుని బాతాఖానీ కొట్టడం గత ఐదారు నెలలుగా మాకు అలవాటే.

" మా తమ్ముడండీ" నా ఎదురుగా కుర్చీలో కూర్చొని, ఏదో పుస్తకము చదువుతున్న అబ్బాయిని చూపిస్తూ అన్నారు ఆవిడ. ' ఈరోజే వూరి నుంచి వచ్చాడు" ఆవిడ లోనికెళ్ళిపోయారు.

"ఏమి చేస్తున్నారు?" పలకరింపుగా అడిగేను ఆ అబ్బాయిని.

"ఉద్యోగ ప్రయత్నములో వున్నానండీ. ఇంజనీరింగ్ చదివాను"

"మన కంపెనీలో ఏదో ఖాళీ వుందని ఈయన రాస్తే వచ్చాడండీ" ఓ ప్లేటులో రెండు కాజాలు తీసుకొని వచ్చి బల్ల మీద పెట్టి అన్నారావిడ. " కాజా తినండి. భయపడన్కరలేదు. నేను చేసింది కాదు. ఊరి నించి మా తమ్ముడు తెచ్చాడీకాజాలు"

ఆమె మాటలకు నవ్వురాలేదు. మా కంపెనీలో ఖాళీయా?

"మీది ఏ బ్రాంచ్..?" వుండబట్టలేక అడిగేను.

"మెకానికల్"

"నా బ్రాంచేనన్నమాట" నాగుండెల్లో రాయిపడింది.

"ఏదో పోస్టు తొందరలోనే ఖాళీఅవుతుందట. జి.ఎం. గారు ఈయనికి సన్నిహితుడు కదా? రమ్మని ఈయన టెలిగ్రాము ఇస్తేనూ.."

అవిడ చెప్పిన అఖరి మాటలు నాకు వినపడలేదు గబగబా గేటువైపు నడిచాను.

"ఏమండీ శర్మగారూ, వెళ్ళిపోతున్నారేమిటి? ఆయన వచ్చేస్తారు. ఆలోగా ఈ కాజాలు తినండి బాగున్నాయి".

'మీ ఆయన తినిపించిన కాజా చాల్లే తల్లీ' అని మనస్సులో అనుకొని రోడ్డు మీద పడ్డాను.

సూర్యుడు దగా చేసిన ప్రపంచము చీకటిలో మునిగిపోయింది.

అప్పుడు తెలిసింది నాకు కొలీగ్ అంటే కొంప ముంచేవాడని.

**3-05-1996 ఆంధ్రజ్యోతి సుచిత్ర వారపత్రిక**